

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్

» విశాఖలో పది కేంద్రాల్లో పరీక్ష

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఐఐటీలు/తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆదివారం విశాఖలోని 10 కేంద్రాల్లో జరగనున్నది. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలను ... మిగతా 8వ పేజీలో

మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లో
మోస్తరు నుంచి భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

జిల్లా మాడుగుల, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అంతకు ముం దు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసింది. వేడిగాలులకు ఉక్కపోత తోడవ్వడంతో జనం చెమటతో ఉక్కిరిబిక్కిరి పడ్డారు. మధ్యాహ్నం తరు వాత ఆకాశం మేఘావృతమై ఉరుములు, పిడుగులతో వర్షం మొదలైంది. ఈదురు గాలులు కూడా వీచాయి. గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సాయంత్రం నాలు గు గంటల నుంచి సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దేవరాపల్లి మండలంలో మోస్తరు వర్షం కురిసింది. కూరకాయ పంటలు, సరుగుడు పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు చెప్పారు. మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటల తరువాత మోస్తరు వర్షం పడింది.


గొలుగొండలో కుండపోతగా కురుస్తున్న వర్షం

సచివాలయాల్లో
సర్వర్ డౌన్

మొరాయిస్తున్న పౌరసరఫరాల వెబ్‌సైట్

» 'రేషన్ కార్డుల' దరఖాస్తుల ఆన్‌లైన్‌కు తీవ్రజాప్యం
» గంటల తరబడి నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు, పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియకు సర్వర్ సమస్య ప్రతిబంధకంగా తయారైంది. సాంకేతిక సమస్యలతో సర్వర్ తరచూ మొరాయిస్తుండడంతో దరఖాస్తుదారులు గంటల తరబడి వేచి వుండాల్సి వస్తున్నది. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుచేసుకుంటున్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


మునగపాక సచివాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం, పేర్లలో తప్పులు సరిచేసుకోవడం, కార్డుల విభజన, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామాల మార్పు వంటి వాటికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందు కోసం సమీపంలో వున్న గ్రామ/ వార్డు సచివాలయాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కొత్తగా పెళ్లియిన వారు, ఇంతవరకు రేషన్ కార్డులు లేని కుటుంబాలు, పిల్లల పేర్లు ఇంతవరకు రేషన్ కార్డులో చేర్చని కుటుంబాలు దరఖాస్తు చేయడానికి సచివాలయాలకు క్యూ కడుతున్నారు. దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 7వ తేదీన ప్రారంభించారు.


మాడుగుల సచివాలయంలో పౌరసరఫరాల వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తున్న ఉద్యోగి

మొరాయిస్తున్న సర్వర్లు

జిల్లాలో 522 గ్రామ/ వార్డు సచివాలయాలు వున్నాయి. ఇక్కడ వుండే సిబ్బంది, ప్రజల నుంచి రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ జిల్లాలో సగానికిపైగా కార్యాలయాల్లో పౌరసరఫరాల శాఖకు చెందిన వెబ్‌సైట్ కనెక్ట్ కావడం లేదు. నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, మునగపాక మండలాల్లోని శివారు గ్రామాల్లో ఈ సమస్య అధికంగా వుండి. సర్వర్ తరచూ డౌన్ అవుతుండడంతో దరఖాస్తుల అప్‌లోడ్‌లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి గంటపాటు మాత్రమే వెబ్‌సైట్ పనిచేస్తున్నది. తరువాత మొరాయిస్తున్నది. దరఖాస్తుదారుని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగానే వెబ్‌పేజీ ఫ్రీజ్ అవుతున్నది. దీంతో వివరాలను మళ్లీ మొదటి నుంచి నమోదు చేయాల్సి వస్తున్నది. ఒక దరఖాస్తు అప్‌లోడ్ కావడానికి రెండు, మూడు గంటల సమయం పడుతున్నది. దీంతో కొన్ని సచివాలయాల సిబ్బంది రేషన్ దరఖాస్తులను మాన్యువల్‌గా స్వీకరిస్తున్నారు. సర్వర్ ... మిగతా 8వ పేజీలో

కన్నతల్లికి గర్భశోకం

రోడ్డు ప్రమాదంలో పెద్ద కుమారుడి మృతి

» తీవ్రంగా గాయపడిన భర్త.. పరిస్థితి విషమం
» స్వల్ప గాయాలతో బయటపడిన భార్య
» గత ఏడాది అనారోగ్యంతో చిన్న కుమారుడి మృతి



మృతిచెందిన మనోజ్
ప్రమాద స్థలిలో బైక్, వ్యాన్

సబ్బవరం, మే 17 (ఆంధ్రజ్యోతి):

ఏడాది వ్యవధిలోనే ఇద్దరు చిన్నారులను కోల్పోయిన ఆ తల్లికి కడుపుకోత మిగిలింది. గత సంవత్సరం అనారోగ్యంతో చిన్న కుమారుడు మృతిచెందగా, శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద కుమారుడు కూడా శాశ్వతంగా దూరమయ్యాడు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై సబ్బవరం మండలం బొర్రమ్మ గెడ్డ వద్ద ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని, వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొనడంతో బాలుడు మృతిచెందాడు. బైక్ నడుపున్న తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ పి.సింహాచలం, బాలుడి బంధువులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

నాతవరం మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన నక్క అప్పలనాయుడు, అప్పలకొండ సోదరులు. వీరు కుటుంబాలతో సహా ఆనందపురం మండలం ... మిగతా 8వ పేజీలో

ఒక్కో టీచర్ పోస్టుకు 26 మంది పోటీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 1,139 ఉపాధ్యాయ ఖాళీలు

» 29,779 మంది అభ్యర్థులు.. 49,658 దరఖాస్తులు
» పురుషుల కంటే 6,233 మంది మహిళా అభ్యర్థులు అధికం
» అత్యధికంగా ఎస్టీ కేటగిరీలో 10,523 మంది దరఖాస్తు
» బీసీ-డీలో 8,330 మంది..



విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీకి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకు 29,779 మంది 49,658 దరఖాస్తు చేశారు. ఒక్కో పోస్టుకు సగటున 26 మంది పోటీపడుతున్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 734 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 400 ఎస్జీటీ పోస్టులు, జువెనైల్ పాఠశాలలో ఐదు పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 29,779 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఎక్కువ మంది రెండు అంత కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయడంతో మొత్తం 49,658 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో పురుషులు 11,773 మంది, మహిళలు 18,006 మంది ఉన్నారు. పురుషుల కంటే 6,233 మంది మహిళా అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారు. రిజర్వేషన్ కేటగిరీలవారీగా పరిశీలిస్తే ఎస్టీ నుంచి అత్యధికంగా 10,523 మంది దరఖాస్తు చేశారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో 400 ఎస్జీటీ పోస్టులు ఉండడంతో గిరిజన ప్రాంతాల నుంచి భారీగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. మొత్తం అభ్యర్థుల్లో మూడింట ఒక వంతు ఈ కేటగిరీకి చెందిన వారు కావడం విశేషం. ఆ తరువాత వెనుకబడిన వర్గాలకు సంబంధించి ఐదు కేటగిరీలకు కలిపి 13,454 మంది అభ్యర్థులు ... మిగతా 8వ పేజీలో

విస్తృతంగా వనాలు పెంచాలి

భూ తాపం తగ్గించేందుకు ఇదే ప్రత్యామ్నాయం

» ప్రతి కుటుంబం ఏటా కనీసం 10 మొక్కలు నాటాలి
» 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో కలెక్టర్ విజయకృష్ణన్


బాటజంగాలపాలెంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, మే 17 (ఆంధ్రజ్యోతి):

భూ తాపాన్ని తగ్గించేందుకు విస్తృతంగా వనాలను పెంచాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బాటజంగాలపాలెంలో నిర్వహించిన 'బీట్ ది హీట్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భౌగోళికంగా వస్తున్న మార్పుల కారణంగా కొన్నేళ్లుగా భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూ తాపం నుంచి భవిష్యత్తు తరాలను రక్షించుకునేందుకు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, ప్రతి కుటుంబం ఏటా కనీసం 10 మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నందున వడదెబ్బబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కువ నీరు తాగాలని సూచించారు. వడదెబ్బకు గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అంతకుముందు ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి డాక్టర్ ఆశతో మాట్లాడారు. మండలంలో మాతృ మరణాలు ఎక్కువగా ఉన్నాయనీ, హైరిస్కు కేసులను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. జాతీయ రహదారి పక్కన బాటసారులకు షెల్టర్‌ను, పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి కుండీలను ప్రారంభించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. క్యాన్సర్ టెస్టింగ్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ పర్యటనలో జడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజుకుమార్, డీపీవో ఆర్.శిరీషారాణి, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి కె.రమామణి, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ పడాల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో దోపిడీ

» ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంటిలోకి చొరబడిన దుండగులు
» 10.5 తులాల బంగారం గొలుసు, గాజులతోపాటు వెండి కుందులు చోరీ


బాధితురాలు వెంకటలక్ష్మిని విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావు

నర్సీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నం శారదానగర్‌లోని ఒంటరిగా నివాసం వుంటున్న వృద్ధురాలి ఇంటిలో దోపిడీ జరిగింది. గుర్తు తెలియని ఇద్దరు యువకులు ఇంటిలోకి చొరబడి, ఆమె మెడలో వున్న సుమారు 11 తులాల బంగారు అభరణాలు, రెండు వెండి కుందులను... మిగతా 8వ పేజీలో

అదృశ్యమైన బాలిక కిడ్నాప్

సీసీ కెమెరాల ఫుటేజీల్లో గుర్తించిన పోలీసులు

» విశాఖ పెదగంట్యాడకు చెందిన మహిళగా నిర్ధారణ
» భర్తతోపాటు అదుపులోకి తీసుకున్న పోలీసులు
» బాలికను విడిపించి, తల్లిదండ్రులకు అప్పగింత
» రెండు రోజుల్లోనే కేసును ఛేదించినందుకు ఎస్పీ అభినందనలు


భీశెట్టి లోహిత (ఫైల్)

అనకాపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి):

బాలిక అదృశ్యం కేసును పట్టణ పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. చిన్నారిని అపహరించిన మహిళతోపాటు ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. వారి చెర నుంచి బాలికను విడిపించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు.



మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, పోలీసు అధికారులు. ముఖాలకు నల్లటి ముసుగులో వున్న నిందితులు

అనకాపల్లిలోని లోకావారివీధికి చెందిన భీశెట్టి హరీశ్, లలిత దంపతులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజూ ... మిగతా 8వ పేజీలో

అట్టహాసంగా మన సైనికులు-మన కుటుంబం ర్యాలీ

» మునిసిపాలిటీలో 260 మంది సైనిక ఉద్యోగుల కుటుంబీకులను సత్కరించిన నేతలు » భావోద్వేగానికి గురైన తల్లిదండ్రులు » జయహో భారత్‌తో మార్మోగిన పట్టణ వీధులు


ఎలమంచిలి పట్టణంలో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ


తెరువుపల్లిలో సైనికుడి కుటుంబ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే సుందరపు


భావోద్వేగానికి గురైన సైనికుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న రమాకుమారి

ఎలమంచిలి, మే 17 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలి పట్టణ ప్రధాన వీధులు జయహో భారత్.. జై జవాన్ నినాదాలతో మార్మోగింది. శనివారం ఉదయం వేలాది మంది మాజీ సైనికులు, వర్తక, వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగులు, యువత, అన్ని శాఖల ఉద్యోగులతో కలిసి నిర్వహించిన మన సైనికులు-మన కుటుంబం ర్యాలీ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. భారతమాత చిత్రపటం పట్టుకొని నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా వందేమాతరం గీతాన్ని ఆలపించి వార్డుల వారీగా కేటాయించిన వాహనాల్లో వార్డులకు చెందిన నేతలు, అధికారులు కలిసి వార్డుల్లో ఉన్న సైనిక ఉద్యోగుల ఇళ్లకు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్, చైర్‌పర్సన్ రమాకుమారి తెరువుపల్లి వార్డులో సైనిక ఉద్యోగుల కుటుంబీకులను ఘనంగా సత్కరించారు. మునిసిపాలిటీలో గుర్తించిన 260 మంది సైనిక ఉద్యోగుల కుటుంబీకుల ఇళ్లకు వెళ్లి వారిని ఘనంగా సత్కరించారు. ఇంతటి గుర్తింపు దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉందని సైనిక ఉద్యోగుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. బీఎస్ఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కర్రి సంతోష్ కుమార్ తల్లిదండ్రులు గోవిందరావు, రాఘవలు భావోద్వేగానికి గురయ్యారు. చైర్‌పర్సన్ రమాకుమారి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ విలేకర్లతో మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలో సేవలు అందించడం పూర్వ జన్మసుకృతమని, త్రివిధ దళాల సైనికుల సేవలు అజరామమన్నారు. ఉగ్రదాడిలో దేశ సైనికులు అందించిన వీరోచిత సేవలు చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, మునిసిపల్ ఉద్యోగులు పల్లా శ్రీను, శ్రీలక్ష్మి, మెప్మా సీఎంఎం పద్మా, ఈపీడీసీఎల్ ఏఈఈ కనకరాజు, స్థానిక నేతలు, సచివాలయ, మెప్మా సిబ్బంది, యువత పాల్గొన్నారు.

వాడవాడలా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర


పాయకరావుపేట: చెక్కానగర్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు, సిబ్బంది


మంగవరంలోని నీటి తొట్టెని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ఆర్. జయప్రకాశరావు, మండల అభివృద్ధి అధికారి ఎ. జయప్రకాశరావు


అచ్యుతాపురం రూరల్: తిమ్మరాజుపేటలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి, గ్రామ పెద్దలు

పాయకరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం పట్టణంలోని చెక్కానగర్, దేవినగర్, వీవర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు, సిబ్బంది చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శివరామ్, టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, ఆది పంచాయతీ గుమస్తా వరహాలు, సచివాలయాల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం మండల ప్రత్యేకాధికారి ఆర్. జయప్రకాశరావు మండలంలోని మంగవరం, అరట్లకోట గ్రామాలలోని పశువుల నీటి తొట్టెలు, చెత్త తొట్టెలు, మినీ గోకులాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లపై చెత్తా, చెదారాలను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ప్రతీ గ్రామంలోనూ పశువుల కోసం నీటి తొట్టెలు, చెత్త తొట్టెలను త్వరితగతిన నిర్మించాలన్నారు. తొట్టెలలో ఎపుడూ నీరు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు, ఏపీవో నానిబాబు, పంచాయతీ కార్యదర్శి కొండలరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో శనివారం సర్పంచ్ భాగ్యలక్ష్మి, గ్రామనేత శివబాపునాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలోని మునగపాక, అరబుపాలెం గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, పారిశుధ్య పనులను చేపట్టారు. చెత్త, చెదారాలు రోడ్లపై వేయకూడదని, రోజూ వచ్చే సేకరణ వాహనాలకు అందజేయాలని సర్పంచులు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి మనోరమ సూచించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ భూపతి అప్పారావు, వెలుగు ఏపీఎం శివప్రసాద్, ఏపీవో ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం చలివేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారిణి మనోరమ ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ రమేష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ నీరజ పాల్గొన్నారు.

కోటవురట్లలో..

వేసవిలో పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచేందుకు ఉపాధి హామీ పథకంలో నీటి కుండీలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బీకే.పల్లి పంచాయతీ సర్పంచ్ పెట్ల లింగంనాయుడు తెలిపారు. శనివారం గ్రామంలో ఎంపీడీఓ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఏర్పాటుచేసిన నీటి కుండీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం తదితరులు పాల్గొన్నారు.


మునగపాకలో గడ్డిని తొలగించిన అధికారులు, గ్రామస్థులు


ఎస్.రాయవరంలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి మనోరమ, ఎంపీడీవో


కోటవురట్ల: బీకే పల్లిలో పశువుల తాగునీటి కుండిని ప్రారంభించిన దృశ్యం

రోడ్డుకు స్థలం వదిలి నేవీ ప్రహరీ నిర్మించాలి

» తహసీల్దార్‌ను కోరిన నేవీ కాలనీవాసులు


తహసీల్దార్‌కు సమస్యను తెలియజేస్తున్న నేవీ కాలనీ పెద్దలు

రాంబిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): లాలంకోడూరు జంక్షన్ నుంచి నేవీ కాలనీకి వెళ్లే దారిని మూసివేసి నేవీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపతుండడంతో 5 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నామని నేవీ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. నేవీకాలనీకి వెళ్లేందుకు దారిని వదిలి నేవీగోడ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దారిని మూసి వేస్తే తమ కాలనీకి వెళ్లేందుకు ఇబ్బందులు పడతామని, మరో ప్రత్యామ్నాయం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్‌చింతువా మాజీ సర్పంచ్ ఎరిపిల్లి చిట్టిబాబు, నేవీకాలనీ పెద్దలు వాడ్ర వెంకటరావు, లంకాడ మంగరాజు, పాలెపు అప్పలరాజు, ఎస్. నాని పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ


వెంకటనగరంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరంలో శనివారం వంకా షాలోమి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వంకా సత్యనారాయణ అందజేశారు. గ్రామానికి చెందిన వంకా షాలోమి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. హోంమంత్రి అనిత సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం 23,920 రూపాయల చెక్కును శనివారం షాలోమి తండ్రి వంకా కొండకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గరికిన అప్పారావు, వంకా శివకుమార్, పారా గాలిబాబు, వంకా హరి, మల్లె రాంబాబు, బాదిన గోపి,వంకా గోపి పాల్గొన్నారు

పాల్మన్‌పేట యూపీ స్కూల్ అప్‌గ్రేడ్

పాయకరావుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్మన్‌పేట ఎంపీయూపీ స్కూల్‌ని ఈ ఏడాది ప్రభుత్వం హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసింది. తీరప్రాంతంలో ఉన్న పాల్మన్‌పేట పంచాయతీలో రాజయ్యపేట, కొర్లయ్యపేట శివారు గ్రామాలుండగా ఈ పంచాయతీలో ఐదు వేల మంది జనాభా ఉన్నారు. వీరి పిల్లల కోసం పంచాయతీలో రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఎంపీయూపీ స్కూల్ ఉంది. ఇప్పటివరకు యూపీ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి వరకు చదివిన విద్యార్థులు 9, 10 తరగతులు, లేదా 6 నుంచి 10వ తరగతి వరకు చదివేందుకు కాకినాడ జిల్లా అద్దరిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళుతున్నారు. వీరు ఉంటున్నది అనకాపల్లి జిల్లా అయినా హైస్కూల్ చదువు కాకినాడ జిల్లాలో చదవడం, 10 సర్టిఫికెట్ పక్క జిల్లాలో రావడం వలన నాన్‌లోకల్‌గా గుర్తించబడి పలువురు ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు. పాల్మన్‌పేట యూపీ స్కూల్‌ని ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులకు నాన్ లోకల్ సమస్య తీరనుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి ఉంచి ఎనిమిదవ తరగతి వరకు 141 మంది విద్యార్థులు చదువుతుండగా, ఈ ఏడాది ఎనిమిదవ తరగతి పూర్తిచేసిన 29 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో తొమ్మిదవ తరగతి చదవనున్నారు.



పాల్మన్‌పేట ఎంపీయూపీ స్కూల్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ట్రాక్టర్లు ఇచ్చారు.. తొట్టెలు మరిచారు

» తొట్టెలు లేక నిరుపయోగంగా ట్రాక్టరు ఇంజన్లు

పాయకరావుపేట రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త, చెదారాలను తరలించడానికి పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టరు ఇంజన్లు ఏడాది కాలంగా పంచాయతీ కార్యాలయాల వద్ద నిరుపయోగంగా పడి ఉన్నాయి.

మండలంలో అధిక జనాభా కలిగిన 8 పంచాయతీలు మంగవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, పెంటకోట, వెంకటనగరం, అరట్లకోట, పీఎల్.పురం, పాల్మన్‌పేటలకు 2024 ఫిబ్రవరిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ట్రాక్టరు ఇంజన్లను ఇచ్చింది. అయితే తొట్టెలను ఇవ్వకపోవడంతో ఇంజన్లు ఏడాదిగా అలంకారప్రాయంగా ఉన్నాయి. జిల్లాలో ట్రాక్టరు ఇంజన్లు కాంట్రాక్టు ఒకరికి, తొట్టెల కాంట్రాక్టు మరొకరికి ఇవ్వడంతో ముందుగా ఇంజన్లు పంచాయతీలకు తెచ్చారు. అయితే ఎన్నికల సమయం కావడంతో తొట్టెలను ఇవ్వలేదు. తరువాత ప్రభుత్వం మారినా ఇంతవరకు తొట్టెలను సరఫరా చేయలేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. లక్షల విలువ చేసే ఇంజన్ టైర్లు పాడైపోతున్నాయని, తొట్టెలను మంజూరు చేయాలని సర్పంచులు అధికారులను కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖరరావును వివరణ కోరగా.. ట్రాక్టర్ల తొట్టెల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులు ఆగకూడదని, ప్రస్తుతానికి తొట్టెలను అద్దెకు తీసుకుని వినియోగించాలని చెప్పినట్టు ఆయన తెలిపారు.



శ్రీరాంపురంలో నిరుపయోగంగా ఉన్న గ్రామ పంచాయతీ ట్రాక్టరు

పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

ఎస్. రాయవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు నరికివేతలో భాగంగా కొరుప్రోలు కాయిల్ పరిశ్రమలతో పాటు కోనవానిపాలెం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు, నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

భక్తిశ్రద్ధలతో తోడపెద్దు అచ్చుపోత వేడుక

మునగపాక, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నారాయుడుపాలెం గ్రామంలో సింహాద్రి అప్పన్న తోడపెద్దు అచ్చుపోత వేడుక ఘనంగా జరిగింది. శనివారం ఉదయం నుంచి తోడపెద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అచ్చుపోత వేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సింహాద్రి అప్పన్న సేవ గరిడీలు ఈ వేడుకకు తరలి వచ్చారు. ఈ వేడుకలో బొడ్డేడ ప్రసాద్, చక్రం తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు చేసి, ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పుష్పమాలలతో అలంకరించారు. అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

పలు గ్రామాల్లో కుక్కల బెడద


ఎన్.నర్సాపురం ప్రధాన రహదారిపై కుక్కలు

నక్కపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పిల్లల నుంచి పెద్దల వరకూ వీధి కుక్కలకు భయపడుతున్నారు. ఇటీవల కాలంలో అన్ని గ్రామాల్లోనూ, రహదారులు, జనావాసాల మధ్య వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులు, గుంపులుగా కనబడుతున్నాయి. ఎన్.నర్సాపురం, గొడిచెర్ల, ఉపమాక, నక్కపల్లి, రాజయ్యపేట, జానకయ్యపేట, సీహెచ్ఎల్‌పురం, జీ జగన్నాథపురం, రమణయ్యపేట, ఉద్దండపురం,కాగిత తదితర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి, పలువురిపై దాడులు చేస్తున్నాయి. నక్కపల్లి ఆస్పత్రికి వచ్చే రోగుల్లో సగటున నెలకు 15 నుంచి 20 మంది కుక్కకాట్లకు గురైన వారే వుంటున్నారు. పిల్లలు రోడ్డు ఎక్కాలంటే భయపడిపోతున్నారు. వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు ఎమ్మెల్యే పరిశీలన


హరిపాలెం బ్రిడ్జీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ పనులలో భాగంగా హరిపాలెం మదుం పక్కన నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు, హరిపాలెం-కొండకర్ల పరిధిలో నిర్మిస్తున్న ఆవ కాలువ కాంక్రీట్‌వాల్ పనులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి పనులను వేగంగా పూర్తి చేయాలని, క్వాలిటీ విషయంలో రాజీపడకుండా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ

అచ్యుతాపురం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు కరాటేపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్‌పర్సన్‌గా కార్యక్రమానికి హాజరైన జి. సన్యాసినాయుడు విద్యార్థులకు కరాటేపై ఇస్నూ మెలకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డి.కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ గర్భగుడి గోపురం నిర్మాణ పూజ


ధాన్యానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక, మే 17 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ గర్భగుడి గోపురం నిర్మాణ పూజలు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్మాణ కమిటీ పిలుపులో భాగంగా ప్రతి ఇంటి నుంచి భక్తులు పూజా ద్రవ్యంగా ధాన్య రాసులను తీసుకు వచ్చారు. వాటికి అర్చకుడు రేజేటి సత్యనారాయణాచార్యులు (నాని) ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని గర్భగుడి గోపురంలో వేసి కాంక్రీట్ వేశారు. ఈ వేడుకను తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు గ్రామీణ యువజన మందిరం కమిటీ సభ్యులు మజ్జిగ అందజేశారు. ఈ వేడుకలో నిర్మాణ కమిటీ సభ్యులు బొడ్డేడ ప్రసాద్, పెంటకోట ఉమేష్, బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి గణపతి అచ్చింనాయుడు, సూరిశెట్టి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మునగపాక, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సిబ్బంది శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి రోజు అవసరాలు రీత్యా కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తు కాగితాల ఏరివేత పేరుతో ఇంటిలో చోరీ

మునగపాక, మే 17 (ఆంధ్రజ్యోతి): తలుపులు మూసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు ప్రయత్నాలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీసులు హెచ్చరించారు. పలువురు గుర్తుతెలియని మహిళలు చిత్తు కాగితాలు వేరుకుంటు ఎన్టీఆర్ కాలనీకి సమీపంలో తలుపులు వేసిఉన్న ఇంట్లోకి వెనుక వైపు నుంచి చొరబడి విద్యుత్ లైటింగ్‌కు సంబంధించిన కొన్ని పరికరాలను అపహరించారు. లైటింగ్ యజమాని నాగూరు ఇంట్లోకి వెళ్లగా కొన్ని విద్యుత్ పరికరాలు కనిపించకపోవడం, వెనుక తలుపులు తీసి ఉండడాన్ని గమనించాడు. కొద్దిసేపటికి ముందే చిత్తు కాగితాలు వేరుకునే వారిని ఇక్కడ చూశామని చుట్టుపక్కల వారు చెప్పారు. వెంటనే నాగూరు తన మిత్రులతో కలిసి నలువైపులా వెతకగా తులసీ కల్యాణమండపంనకు సమీపంలో వారు కనిపించారు. వారి వద్ద ఉన్న పరికరాలను తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. మునగపాక పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కదలికలను వీక్షించాలని చెప్పారు.



తిరంగా ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, కూటమి నాయకులు

చోడవరంలో ఘనంగా తిరంగా ర్యాలీ

చోడవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌పై భారత్ సాధించిన ఘన విజయాన్ని స్వాగతిస్తూ.. కూటమి నేతల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత జాతీయ పతాకాలను పట్టుకుని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కొత్తూరు జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తిరిగి కొత్తూరు జంక్షన్ వరకూ నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీలో టీడీపీ, జనసేన నాయకులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఏడువాక లక్ష్మణకుమార్, మజ్జి గౌరీశంకర్, దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, గూనూరు మూలినాయుడు, కర్రి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. ప్రజలు ఉపశవనం

గొలుగొండ/కృష్ణాదేవిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ విస్తృతంగా కాసింది. గొలుగొండ, జోగంపేట, చీడిగుమ్మల, పాతకల పాడు, కొత్తఎల్లవరం, కొత్తమల్లంపేట, ఏఎల్‌పురం, చోద్యం, సిహెచ్.నాగాపురం, కొంగసింగి, చోద్యం, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లో సాయంత్రం నాలుగు గంటలకు ఉరుములతో కూడిన వర్షం పడింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. కాగా, ఈ వర్షంతో ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్ చెరువును తలపిస్తున్నది.

పంట కాలువల అభివృద్ధికి కృషి

గొలుగొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ అన్నారు. మండలంలో రావణాపల్లి రిజర్వాయర్ కింద గబ్బాడ, నీలంపేట గ్రామాల్లోని పంట కాలువల్లో పూడికతీత పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు సాగునీరు అందించే పంట కాలువల్లో పూడిక తొలగించేందుకుగాను ఉపాధి పథకంలో నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. రైతులు త్వరితగతిన పూడికతీత పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రావణాపల్లి రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు ధనుమిరెడ్డి మధు, లాలం మురళీ కృష్ణ, బొళెం వెంకు నాయుడు, రైతులుపాల్గొన్నారు.

లైటరైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి

నాతవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): సుందరకోట పంచాయతీ పరిధిలోని భమికలొద్ది, సిరిపురం ప్రాంతంలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాల అనుమతులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. పార్టీ బృందం సభ్యులు శనివారం ఈ ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలు జరుగుతున్న డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేటరైట్ తవ్వకాల వల్ల అడవిని నమ్ముకుని బతుకుతున్న గిరిజనులు ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే నీటి వనరులు కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణం కూడా దెబ్బ తింటున్నదని వాపోయారు. సీపీఐ లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, నాయకులు జి.గురుబాబు. డి.క్రాంతి, మండల సీపీఐ కార్యదర్శి అంకంరెడ్డి చిన్నయ్యనాయుడు, పావడ సత్తిబాబు, ఎరటా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పులు తగలకుండా జాగ్రత్తలు అవసరం

▸▸ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి



ప్రతిజ్ఞ చేయిస్తున్న చింతకాలయ పద్మావతి

నర్సీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): వడగాడ్పులు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి సూచించారు. శుక్రవారం మునిసిపాలిటీలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ఆర్డీవో వీవీరమణ, తహసీల్దార్ రామారావు తదితరులు స్థానిక ఐదు రోడ్ల కూడలి వద్ద మానహారం చేశారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాత మునిసిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అక్కడ వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తల పై బీట్ ది హీట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి మాట్లాడుతూ ఇంట్లోంచి బయటకు వచ్చేటప్పుడు మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు ఇంట్లోంచి బయటకు రాకూడదని సూచించారు. ఏమైన పనులు ఉంటే ఉదయం చక్కబెట్టుకోవాలని అన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడలో పడుకోబెట్టి దుస్తులు వదులు చేసి గాలి తగలనీయాలని సూచించారు. లీటర్ నీటి ఓఆర్ఎస్ పేకెట్ కలిపి తాగించి దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు చింతకాయల రాజేశ్, దనిమిరెడ్డి మధుబాబు, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిరోధించండి



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న వాకర్స్ క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు

నర్సీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్టేడియంలో ఓపెన్ డ్రికింగ్ వల్ల క్రీడాకారులు, వాకింగ్‌కి వచ్చే మహిళలు, సీనియర్ సిటిజన్లు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు తీసుకునే యువకులు స్టేడియంలో సంచరిస్తున్నారని తెలిపారు. వివిధ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు గంటల తరబడి స్టేడియంలో ఉండిపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేడియంలో సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి మేనేజర్‌కి వినతిపత్రం ఇచ్చారు. స్టేడియంలో ప్రహరీ గోడ లేకపోవడంతో రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. గతంలో వాచ్‌మన్ ఉండేవాడని, ఐదు నెలల క్రితం వాచ్‌మన్ పోస్టు తీసేయడంతో స్టేడియంలో పర్యవేక్షణ లేకుండా పోయిందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, బహిరంగ మద్యపానం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు స్టేడియంలో వదిలేస్తున్నారని ఆయన చెప్పారు. తాగిన మైకంలో మల, మూత్ర విసర్జన చేయడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, పూర్వపు అధ్యక్షుడు ఎ.వరహాలనాయుడు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీలు



మాకవరపాలెం సవిడి గెడ్డ వద్ద చెత్తాచెదారం తొలగిస్తున్న అధికారులు, నాయకులు

గొలుగొండ/మాకవరపాలెం/నాతవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం మండలాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. గొలుగొండ మండలంలోని చీడిగుమ్మల, పాలకపాడు, గొలుగొండ, సాలికమల్లవరం, గుండుపాల, కశిమి, రావణాపల్లి, ఏటిగైరంపేట, జోగంపేట, కొత్తమల్లంపేట, పాతమల్లంపేట గ్రామాల్లో ప్రజలు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు గౌరి, వెంకటరమణ, కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో సవిటి గెడ్డకు ఆనుకొని ఉన్న చెత్తను అధికారులు తొలిగించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బి.మెమాన్‌రావు మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం గిడుతూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఛాయిసుధా, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, ఎంపీపీ సర్వం పాల్గొన్నారు.

నాతవరం మండలంలోని మర్రిపాలెం పంచాయతీలో పొట్టిపాలెం డొంకాడ గ్రామాలకు చెందిన 650 మంది గిరిజనులతో సమావేశమై ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. అలాగే నాతవరంలో ఉపాధి కూలీలకు టీడీపీ నాయకులు శెట్టి నానాజీ 300 మందికి మజ్జిగ ప్యాకెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల మొక్కలు నాటడం జరిగింది. కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎన్.విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, తెలుగుదేశం పార్టీ నాతవరం అధ్యక్షుడు పైల సూరిబాబు, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, నీటి సంఘాల అధ్యక్షులు పారుపల్లి దాసు, రంభ సత్యనారాయణ, టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి, ఏపీవో దాసరి కొండాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

నర్సీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో శనివారం పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ పని చేసినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

నర్సీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకున్నామని ఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో దనిమిరెడ్డివీధి, కొత్తవీధి, బీసీ కాలనీ, పీనారిపాలెంలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆయా వార్డుల్లో అదనపు ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయడానికి అంచనాలు తయారు చేయాలని ఏఈకి చెప్పినట్టు ఆయన తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కృష్ణాదేవిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం రామాలయం వద్ద శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని సర్పంచ్ లోచల సుజాత ప్రారంభించారు. అనంతరం అధికారులు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు చింతల బుల్లిప్రసాద్, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది హేమంత్, మంగ, ధనలక్ష్మి, రాజకుమారి పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు

కృష్ణాదేవిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో శనివారం కోతుల దాడిలో ఎ.రాజా, ఎల్.లక్ష్మి గాయపడ్డారు. వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. గ్రామంలో కోతులు అధికంగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని బాధితులు, ప్రజలు కోరుతున్నారు.

లేటరైట్ తవ్వకాల్లో అక్రమాలు

నర్సీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): సుందరకోట పంచాయతీ బమిడికిలొద్దిలో లేటరైట్ తవ్వకాలలో అడుగడుగునా అక్రమాలు జరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఆరోపించారు. లేటరైట్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో వేయింగ్ మిషన్ పెట్టలేదని పేర్కొన్నారు దీనివల్ల పారదర్శకత లోపించిందని ఆయన ఆరోపించారు.

గోవాడ క్రషింగ్ సీజన్‌పై ప్రకటన చేయండి

▸▸ ఫ్యాక్టరీ ఎదుట ఏపీ రైతు సంఘం నేతల ఆందోళన



చీఫ్ ఇంజినీరుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

చోడవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వచ్చే క్రషింగ్ సీజన్‌పై యాజమాన్యం బహిరంగ ప్రకటన చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కర్రి అప్పారావు, జి.నాయనిబాబు డిమాండ్ చేశారు. శనివారం గోవాడ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టిన నాయకులు, గత రెండు సీజన్లకు సంబంధించిన రైతుల బకాయిలు చెల్లించడంతోపాటు వచ్చే సీజన్‌కు చెరకు రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ నడవడానికి ముందుగానే ఓవర్‌హాలింగ్ పనులు ప్రారంభించి అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్మికుల వేతన బకాయిలు విడుదల చేయడంతోపాటు, గోవాడను ఆదుకోవడానికి ప్రభుత్వం గ్రాంటు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫ్యాక్టరీ చీఫ్ ఇంజినీరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో రైతు సంఘం నాయకులు ఎస్‌వీ. నాయుడు, వీవీ శ్రీనివాసరావు, కంఠంరెడ్డి నర్సింహులు, బోను దేముళ్లు, శరగడం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో వర్షం



దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరాపల్లి, మే17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి సేదదీరారు. వర్షంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం దుక్కులు, కూరగాయల పంటలు, సరుగుడు తోటలకు మేలు అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంది. తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారింది. మూడు గంటలు తేలికపాటి జల్లులతో ఆరంభమై ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

చీడికాడలో..

చీడికాడ, మంచాల, కోనాం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మధ్యాహ్నం 2గంటల వరకూ మండిన ఎండకు జనం విలవిల్లాడిపోయారు. రెండున్నర గంటలకు వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మినీ మహానాడు రేపు

మాడుగుల రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద గల చెరకు కాటా ఆవరణలో ఈనెల 19వ తేదీన టీడీపీ నియోజకవర్గ మినీ మహానాడును నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

సందడిగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర



కొత్తూరు జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, ప్రత్యేక అధికారిణి రాజేశ్వరి, ఇతర అధికారులు

చోడవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా బీట్ ద హీట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ప్రత్యేకాధికారి కె.రాజేశ్వరి, ఇతర అధికారులు కొత్తూరు జంక్షన్‌లో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కొత్తూరు జంక్షన్‌లో మజ్జిగను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ మహేష్, పంచాయతీ ఈవో నారాయణరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు నాయుడు, జనసేన నాయకులు కర్రి రమేష్ పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని మండల ప్రత్యేకాధికారిణి ఆర్.పూర్ణిమదేవి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చౌడువాడ పీహెచ్‌సీ ఆవరణలో కమ్యూనిటీ సోక్ పిట్‌కు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి బియ్యం, కిరాణా సామగ్రి అందించి, శాలువలతో సత్కరించారు. రామాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగను సర్పంచ్ దాడి ఎరుకునాయుడు పంపిణీ చేశారు.కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు ఏటుకూరి రాజేష్, ఎంపీడీవో సాంబశివరావు, డిప్యూటీ ఎంపీడీవో కుమారి, ఈవోపీఆర్డీ జి. రమణి, తహసీల్దార్ డి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు అందరం నడుం బిగిద్దామంటూ ప్రజలతో మండల ప్రత్యేకాధికారి మంజులవాణి ప్రతిజ్ఞ చేయించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సువర్ణరాజు, ఏఈఈ తేజ, ఈవోపీఆర్డీ అనంత ఉమాదేవి, త్రినాథ్ పాల్గొన్నారు. మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని బి.కింతాడలో సర్పంచ్ బూరే బాబూరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

రావికమతంలో..

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన బీట్ ది హీట్ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వసంతరావు పాల్గొన్నారు. అనంతరం రావికమతం సంపద కేంద్రాన్ని ఆయన సందర్శించి, సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, ఏవో సీతారామస్వామి, ఈవోపీఆర్డీ భానోజీరావు, కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రోలుగుంటలో..

మండలంలోని కుసర్లపూడిలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రం వద్ద మొక్కలను నాటారు. అనంతరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచ్ మద్దు అప్పలనాయుడు పాల్గొన్నారు.



కె.కోటపాడు: చౌడవాడ పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి ఆర్. పూర్ణిమదేవి

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఆవరణలో తుప్పలు తొలగించి, పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

చీడికాడలో..

పరిసరాల పరిశుభ్రతకు అందరూ ముందుకు రావాలని మాడుగుల నియోజకవర్గ ప్రత్యేకాధికారి కె.మోహన్‌రావు కోరారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా చీడికాడ సచివాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్థులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్. మూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎ.సన్యాసిరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండల కేంద్రంలో శనివారం ప్రత్యేకాధికారి గోపాలరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, అధికారులు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిబ్బిడిలో అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోర్టు సముదాయాలను సందర్శించిన జిల్లా జడ్జి



కోర్టు సముదాయంలో న్యాయమూర్తులు, న్యాయవాదులతో జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు

చోడవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయాలను జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు శనివారం సాయంత్రం సందర్శించారు. కోర్టు సందర్శనకు వచ్చిన చిన్నంశెట్టి రాజు స్థానిక అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తులతోపాటు, బార్ అసోసియేషన్ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు కె. రత్నకుమార్, ఎం. నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కామిరెడ్డి వెంకటరావు, చీపురుపల్లి సూర్యనారాయణ, కాండ్రేగుల డేవిడ్ ఇతర న్యాయవాదులు జిల్లా జడ్జికి సాదరంగా స్వాగతం పలికారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తక్కువ

▸▸ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



చెట్టుపల్లిలో పంటలను పరిశీలిస్తున్న మోహన్‌రావు

చీడికాడ, మే 17(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయంతో ఎరువులు, పురుగుమందులను తగ్గించి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు అన్నారు. చీడికాడ, పెదగోగాడ, చెట్టుపల్లి గ్రామాల్లో వేసిన 30 రకాల చిరుధాన్యాల పంటలను శనివారం ఏవో కృష్ణవేణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతకాలంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. తొలకరిలో జిల్లాలో 6,780 ఎకరాల్లో రైతులతో చిరుధాన్యాల పంటలు సాగుకు విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఆయనతోపాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.అరుణ్, వై.సంగీతరెడ్డి, డి.వాసు, బి.నాగమణి పాల్గొన్నారు.

ఐటీయూసీ ఆసియా పసిఫిక్ ఇండియన్ యూత్ కోర్ కమిటీ మెంబరుగా లెనిన్

బుచ్చెయ్యపేట, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రాజాం గ్రామానికి చెందిన నాగులాపల్లి లెనిన్ ఐటీయూసీ ఆసియా పసిఫిక్ ఇండియన్ యూత్‌కోర్ కమిటీ మెంబరుగా నియమితులయ్యారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకూ ఢిల్లీలో ఐటీయూసీ నిర్వహించిన ఇండియన్ యూత్ లీడర్‌షిప్ అకాడమీలో లెనిన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

చోడవరం, మే17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే సాగు చేయాలని కోరుతూ శనివారం చాకిపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగు పద్ధతులు, కషాయాల తయారీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఎలమంచిలి వెంకటరావు, పోలేపల్లి శ్రీనివాసరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతల సుజాత, ప్రసాద్, ప్రకృతి విభాగం అధికారులు నాగమణి, కాండ్రేగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు

రోలుగుంట, మే 17(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ నాగేశ్వరరావు అన్నారు. శనివారం కొమరవోలులో జరుగుతున్న ఉపాధి పనులను ప్రత్యేకాధికారి మనోహర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

మాడుగుల రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగరం గ్రామంలో శనివారం ఉపాధి కూలీలకు స్థానిక సర్పంచ్ జయమ్మ మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధి హామీ పనులను ఎంపీడీవో కొంకి అప్పారావు పర్యవేక్షించారు.

వైస్ ఎంపీపీగా పంచాడ ఎంపిక

దేవరాపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ వైస్ ఎంపీపీ అభ్యర్థిగా వైసీపీకి చెందిన మామిడిపల్లి ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడును ఎంపిక చేసినట్టు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. శనివారం తారువలో వైసీపీ ఎంపీటీసీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. సభ్యులు ఏకగ్రీవంగా సింహాచలంనాయుడును వైస్ ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఈనెల19న జరిగే వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియలో ఎంపీటీసీ సభ్యులు పాల్గొని సింహాచలం నాయుడును గెలిపించాలని బూడి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మాడుగుల, మే 17 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో శనివారం ఉదయం మజ్జిగ చలివేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ప్రారంభించారు. పంచాయతీ సర్పంచ్ యడ్ల కళావతి, కార్యదర్శి మూర్తిబాబు, పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు రంజిత్‌వర్మ, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రజావేదిక

చీడికాడ, మే 17(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కిషోర్ లింకన్ అన్నారు. మండలంలో తురువోలు, చీడికాడ, చినగోగాడ లబ్ధిదారులతో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో విచారణ జరిగింది. మూడు గ్రామాల్లోని వివిధ సమస్యలను వారు వివరించారు. అధికారులు విచారణ జరిపి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీలు

» పాడేరు, అరకులోయలలో

పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, జనాలు



అరకులో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీలో దొన్నుదొర, టీడీపీ నాయకులు

పాడేరురూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ తీవ్రవాదులు పెహల్గాంలో పర్యాటకులపై దాడికి ప్రతిగా చేపట్టి ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తిరంగా ర్యాలీలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాడేరులో నిర్వహించిన ర్యాలీలో టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య పాల్గొన్నారు. జాతీయ జెండాలతో జయహో భారత్, భారత్ మాతకి జై, ఖబడ్దార్ పాకిస్థాన్ అంటూ నినాదాలు చేస్తూ దేశ భక్తిని చాటారు. ప్రధాని నరేంద్ర మోదీ చాకచక్యంతో పాకిస్థాన్ కుటిల నీతిని ప్రపంచానికి తెలియజేసేలా చేశారన్నారు. పాకిస్థాన్‌లో ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి భారత సైన్యం తన సత్తా ఏమిటో చాటి చెప్పిందన్నారు. ఈ పోరాటంలో మురళీ నాయక్ వంటి జవానులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎం. మణికుమారి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, నాయకులు డప్పోడి వెంకటరమణ, ఎస్వీరమణ, డిప్పల వెంకటకుమారి, పి.పాండురంగ స్వామి, బాకూరు వెంకటరమణ, టి.మహేశ్వరరావు, బీజేపీ నాయకులు కూడా కృష్ణారావు, పాంగి రాజారావు, పెనుమాక రవికుమార్, జనసేన నాయకులు బొంకుల దివ్యలత, సీహెచ్.అనీల్‌కుమార్, ఎన్.మురళీకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అరకులోయ: పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై భారత్ సైన్యం సరైన రీతిలో ఎదురు దాడి చేసి సమాధానమిచ్చిందని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, ఆపార్టీ నేతలు పేర్కొన్నారు. శనివారం అరకులోయ తహసీల్దార్ కార్యాలయంనుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ అమరులైన భారత్ సైనిక కుటుంబాలకు దేశం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పెదలబుడు, మాదల సర్పంచ్‌లు దాసుబాబు, శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, మహిళా నేతలు బూర్జలక్ష్మి, బొరిబొరి లక్ష్మి, ద్రౌపతి, గంగ, నీరజ, చిన్ని, జనసేన నాయకులు రఘునాథ్, మాజీ సర్పంచి లకోయ్ మహదేవ్, వనాది, జనసేన ఇన్‌చార్జి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు గైర్హాజరైతే సమస్యలేం పరిష్కారమవుతాయి?

» పెదబయలులో మండల సమావేశాన్ని బహిష్కరించి ప్రజా ప్రతినిధులు నిరసన

» కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

పెదబయలు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు గైర్హాజరుకావడానికి నిరసనంగా మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రజా ప్రతినిధులు బహిష్కరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నిర్దేశించిన సమయానికి 23 పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హజరయ్యారు. అటవీ, ఆర్టీసీ, ఎక్సైజ్, పశుసంవర్ధక, జీసీసీ, కాఫీబోర్డు శాఖల మండల స్థాయి అధికారులు గైర్హాజరుకావడంతో ప్రజా పతినిధులు మండిపడ్డారు. అధికారుల తీరును నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం ఎంపీపీ ఛాంబర్‌లో సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై అక్కడ హజరైన అధికారులతో మాట్లాడారు. సమావేశానికి హజరుకాని అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సభ్యులు పేర్కొన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు ప్రజా ప్రతినిధులను అవమాన పరుస్తున్నారని వైస్ ఎంపీపీ-2 రాజుబాబు ఆరోపించారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశాల్లో ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని ఆశతో ప్రజలు తమను నాయకులుగా ఎన్నుకున్నారని, అటువంటిది సమావేశానికి అధికారులు హజరు కాకపోతే ఎలా అని ప్రశ్నించారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య

గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉన్నా సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని డీఈఈ గోపాలకృష్ణపై మండిపడ్డారు. మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా బోర్లు తవ్వకాలు చేపట్టి, వాటికి హెడ్‌లు బిగించలేదన్నారు.మండల కేంద్రంలో ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటిని సరఫరా కావడంలేదని వా పో యారు.

బంగారుమెట్ట- సంపంగిపుట్టు రోడ్డును బాగు చేయాలి

ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కిమంకరి బొంజుబాబు మాట్లాడుతూ పాడేరు - ముచంగిపుట్టు ప్రధాన రహదారిలోని బంగారుమెట్ట నుంచి సంపంగిపుట్టు వరకు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డును మరమ్మతు చేయాలని చేపట్టాలని అనేక సార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. తమకు ఇప్పటి వరకు అటవీ శాఖ రేంజర్ ఎవరో కూడా తెలియదని సభ్యులు తెలియదని పేర్కొన్నారు. ఏ ఒక్క మండల సమావేశానికి ఆయన రాలేదని మండిపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న రేంజర్‌ను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, అటవీ శాఖలో జరుగుతున్న విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం సభ్యులు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాంగి సోనే, ఎంపీడీవో పూర్ణయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు, ఈవోపీఆర్‌డీ నరసింగరావు, ఎంఈవో కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎగువశోభ



విజేత జట్టుకు నగదు, ట్రోఫీ అందిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన క్రీడకారులను ప్రోత్సహిస్తే రాణిస్తారని స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు అన్నారు.. ఎగువశోభ పంచాయతీ పోర్నపాడోర్ గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో సమ్మర్ క్రికెట్ టోర్నీ నెలరోజులుగా నిర్వహించారు. శనివారం ఫైనల్స్‌లో ఎగువశోభ జట్టు, పెదబిడ్డ జట్టు తలపడగా.. మొదటి బ్యాటింగ్ చేసిన పెదబిడ్డ 45 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎగువశోభ జట్టు లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఈ జట్టుకు రూ. 20వేలు ట్రోఫీ, 'రన్నర్ జట్టు పెదబిడ్డకు రూ.10 వేలు ట్రోఫీ, మూడో బహుమతి మేనేజ్‌మెంట్ జట్టు దిగువశోభకు రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ యువజన నాయకుడు మట్టం శ్యామ్, రాజు, కుమార్, దాసు, సుబ్బారావు, అనిల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి: పీడీ సూర్యలక్ష్మి



పినకోటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

అనంతగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి ఆదేశించారు. మండలంలోని మారుమూల జీనబాడు పంచాయతీలోని కొరపర్తి, పినకోటలలో అంగన్‌వాడీ కేంద్రాల శనివారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం తీరుపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చలివేంద్రాలను ప్రారంభించారు. ఆమె వెంట అనంతగిరి సీడీపీవో సంతోషికుమారి, సూపర్‌వైజర్లు ఉన్నారు.

కూలీలందరికీ ఉపాధి పని



నీటి కందకాల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీలందరికీ పనికల్పించాలని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని చిలకలమామిడిలో నీటికందకాల నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తించిన పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలన్నారు. ప్రతి ఉపాధి కూలీ గరిష్ఠ వేతనం తీసుకోవాలన్నారు. గోకులాలు, పశువులు నీటి తొట్టెల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో రాజు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 12 బాలల సంరక్షణ కేంద్రాలు



ధ్రువీకరణ పత్రాలందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 12 బాలల సంరక్షణ కేంద్రాలను గుర్తించినట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. జువైనల్ జస్టిస్ బోర్డు నుంచి అనుమతి కోరుతూ 16 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా.. ఐసీడీఎస్ అధికారిణి ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జి జువైనల్ ప్రొబేషన్ అధికారి ఓవీఎల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతో కూడిన కమిటీ సభ్యులతో జిల్లాలోని 16 కేంద్రాలను పరిశీలించి నిర్వాహణకు అనువుగా ఉన్న 12 కేంద్రాలను గుర్తించినట్లు వివరించారు. వీరికి ధ్రువపత్రాలను శనివారం జారీ చేశామన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను విజయవంతం చేయాలి: కలెక్టర్

» అధికారులు, ఉద్యోగులతో మానవహారం



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది మానవహారం

పాడేరు, మే 17(ఆంధ్రజ్యోతి): నెలలో ప్రతి శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఆయన అధికారులు, ఉద్యోగులతో మానవహారం నిర్వహించి స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి ప్రారంభించారు. ముందుగాఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వాన నీటి సంరక్షణ పిట్‌ను, మరో చోట ఖనిజాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డ్వామా పీడీ విద్యాసాగరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, డీపీవో బి.లవరాజు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పీఎస్.కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో, ఐటీడీఏలో..

స్థానిక కలెక్టరేట్‌లో, ఐటీడీఏ కార్యాలయంలోనూ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లోని ఫైళ్లను శుభ్రం చేయడంతోపాటు పరిసరాల్లోని పనికిరాని మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాలోజేసీడాక్టర్ ఎం.జే.అభిషేక్ గౌడ, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, జిల్లా పౌరసరఫరాల అధికారి బి.గణేశ్‌కుమార్, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, కలెక్టరేట్ ఏవో బి.అప్పారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన చికిత్స అందించారు. పాత బస్ స్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమార్, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో జీఎం కొత్తూరు గ్రామంలో నిర్వహించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, సీడీపీవో సువర్ణమ్మ, ఉపాధి ఏపీవో ఎస్.కొండబాబు, సర్పంచ్ కె.రాంబాబు, పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పెదపాడు రోడ్డులో ప్రజా ప్రతినిధులతో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేశారు. రేంజ్ అధికారి శ్రీనివారావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, సర్పంచి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చింతపల్లి అటవీశాఖ డీఆర్వో వెంకటరాజు అన్నారు. శనివారం మండలంలోని రింతాడ పంచాయతీ ఊబలు గ్రామంలో స్వర్ణంధ్ర, స్వచ్చంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో భూషణం, ఉపాధ్యాయుడు పెద్దబ్బాయి, చిరంజీవి పాల్గొన్నార

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



వైద్యులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

పెదబయలు, మే 17 (ఆంధ్రజ్యోతి): గాయకుడు డాక్టర్ దుడ్డు సత్యనారాయణ చొరవతో శంకర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సీతగుంట గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల -1లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. 250 మంది ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్టు శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్ వెల్లడించారు. వీరిలో 25 మందికి శస్త్ర చికిత్స అవసరమని, మరో 30 మందికి కళ్లద్దాలు పడతాయని చెప్పారు. ఈ శిబిరాన్ని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సందర్శించారు. ఉచిత శిబిరం నిర్వహించిన సత్యనారాయణను అభినందించారు. వైస్ ఎంపీపీ రాజుబాబు, ఎంపీటీల ఫోరం అధ్యక్షుడు బొంజుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం అందుబాటులో లేక వృద్ధుడి మృతి

జి.మాడుగుల, మే 17 (ఆంధ్రజ్యోతి): సకాలంలో 108 వాహనం అందుబాటులోకి రాకపోవడంతో మండలంలోని లువ్వాసింగి గ్రామానికి చెందిన వృద్ధుడు జర్రా సూరిబాబు శనివారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపించారు.. మృతుడు సూరిబాబు ప్రభుత్వ పింఛన్ సొమ్ముతో ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఆయన శనివారం ఆకస్మికంగా శ్వాస సంబంధిత వ్యాధికి బారిన పడ్డాడు. దీంతో అతని అల్లుడు ఆదినారాయణఉదయం 108 వాహనానికి సమాచారం అందించగా సదరు సిబ్బంది వాహనం సిద్ధంగాలేదని, ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించారని బదులిచ్చారు. ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక సాయంత్రం వరకు గ్రామంలోనే సూరిబాబును ఉంచేశారు.దీంతో శ్వాస తీసుకోవడం లో సమస్యలతో మృతి చెందాడు.

రూ. 1.54 కోట్లతో ఎల్‌ఈడీ లైట్లు: ఎంపీ తనూజారాణి



భస్కీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు ఎల్‌ఈడి వీధి లైట్లు అందిస్తున్న ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ, మే 17 (ఆంధ్రజ్యోతి): అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న 11 మండలాల పరిధిలోని గ్రామాల్లో రూ. 1.54 కోట్లతో ఎల్‌ఈడీ వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల కు ఎంపీ ఎల్‌ఈడీ లైట్లను పంపిణీ చేశారు. అరకు మండలంలో రూ.13.94 లక్షలతో 280 ఎల్‌ఈడీ లైట్లు కొనుగోలు చేసినట్టు చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి అవసరమున్నచోట్ల గుర్తించి వీధి లైట్లు చేయాలన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించనున్నట్టు చెప్పారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా మాడగడ సన్‌రైజ్‌వ్యూ పాయింట్ వద్ద గ్లాస్ బ్రిడ్జి ఏర్పాటుకు కేంద్ర టూరిజం శాఖకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీ తనూజారాణి మండలంలోని 18 పంచాయతీల ప్రజా ప్రతినిధులకు ఎల్‌ఈడీ బల్బులను అందజేశారు. అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాలల్లో తన నిధులతో ఈ బల్బులు అదిస్తున్నట్టు చెప్పారు. ఈ మండలంలో రూ. 18లక్షలు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైఎస్ ఎంపీపీలు లలిత, ఆనంద్, మండల ప్రత్యేక అధికారి నంద్, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పాడేరురూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ జనరల్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. అయితే, ఒకేషనల్ విద్యార్థులకు మరో పరీక్ష సోమవారంతో ముగుస్తుందని డీఐఈవో ఎస్.భీమశంకరరావు తెలిపారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి.

స్పెషల్ డీఎస్సీపై ప్రకటన చేయాలి: సాధన సమితి



కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 2025 మెగా డీఎస్సీ ఉత్తర్వుల నుంచి ఏజెన్సీ ప్రాంత పోస్టులు మినహాయించాలని కోరుతూ 19వ తేదీన చేపట్టనున్న అరకులో రైల్ రోకో నిర్వహిస్తామని ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా చైర్మన్ కుడుముల కాంతారావు అన్నారు. ఈ మేరకు నాయకులతో శనివారం కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు ఎస్.శర్మానపడాల్, కె.రాధాకృష్ణ, వి.నాగేశ్వరరావు, భాను, చిన్ని, పి.అప్పలనర్స, ఎస్.మాణిక్యం, కేకే.జయప్రసాద్, కె.సుబ్రమణ్యం, పల్లుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ:ఏజెన్సీలో టీచర్ పోస్టులు ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నేతలతో స్థానిక గిరిజన్ భవన్‌లో జిల్లా కో-కన్వీనర్ పొద్దు బాలదేవ్ ఆధ్వర్యంలో సమావేశం న్విహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ చైర్మన్ కుడుముల కాంతారావు, ముఖ్య సలహాదారుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో టీచర్ పోస్టులన్నీ ఆదివాసీలతో భర్తీ చేస్తామని ఈ నెల 20న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 19న అరకులోయలో రైల్‌రోకో చేపడతామని హెచ్చరించారు. స్పెషల్ డిస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.ధర్మన్నపడాల్, నాయకులు అప్పలనర్సయ్య, గిరిజన ఉద్యోగుల జిల్లా మాజీ కార్యదర్శి సీవేరి బాలకృష్ణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు, రాంబాబు, మల్లేశ్, నాగేంద్ర, ఐసుబాబు తదితరులు పాల్గొన్నారు.

19న రైల్ రోకోను జయప్రదం చేయండి

ముంచంగిపుట్టు: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న అరకులో చేపడుతున్న రైల్ రోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ మండల కో- కన్వీనర్లు రెయ్యల నాగభూషన్, వెంగడ జగన్ అన్నారు. శనివారం నిరుద్యోగులతో ఇక్కడ ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ ప్రతినిధి పాంగి సత్తిబాబు, నిరుద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించుకోవాలి

» విశాఖ అటవీ సర్కిల్ సీఎఫ్ దివన్ మైదీన్



భీరం అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న సీఎఫ్ దివన్ మైదీన్, పక్కన పాడేరు డీఎఫ్‌వో

జి.మాడుగుల, మే 17 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించుకోవాలని విశాఖపట్నం అటవీ సర్కిల్ కన్సర్వేటర్ బీఎం దివన్ మైదీన్ అన్నారు. మండలంలోని భీరం పంచాయతీలోని అటవీ ప్రాంతాన్ని శనివారం ఆయన శనివారం సందర్శించారు. భీరం గ్రామంలో అటవీశాఖ కాంపా పథకం ద్వారా చేపట్టిన ముందస్తు పనులను పరిశీలించారు. అక్కడి నుంచి వెళ్లి వి.కోడాపల్లి (వెంకటపాలెం)లో పెంచుతున్న పలు రకాల మొక్కల జాతుల నర్సరీని తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీఎఫ్ మాట్లాడుతూ, అడవులను పెంపకంపై గిరిజనులకు అవగాహన కల్పించాలని, పర్యవేక్షణలో సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన ఎప్పటికప్పుడు పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. అతనిపాటు పాడేరు డీఎఫ్‌వో పి.సందీప్‌రెడ్డి, రేంజ్ అధికారి ఆర్.అప్పలనాయుడు, సెక్షన్ అధికారులు జి.శ్రీరాములు, వివి.నాయుడు, ఎఫ్‌బీవో జి.మాధవి, సిబ్బంది కె.సత్తిబాబు, ఎం.బాలన్న పాల్గొన్నారు.

మిరియాల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త బిందు

చింతపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు మిరియాల సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి చెట్టి బిందు అన్నారు. శనివారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు, ఉద్యాన పరిశోధన స్థానం సంయుక్తంగా మిరియాల పంటలో మేలైన సాగుపై ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరియాల నర్సరీల తయారీకి ఇది అనుకూలమ సమయమన్నారు. జూన్, జులైలో నాట్లు వేసుకోవాలన్నారు. టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ మిరియాలు పంటలో కుళ్లు తెగులు నివారణకు ట్రైకోడెర్మా వాడాలన్నారు.అనంతరం గిరిజన రైతులకు మేలిజాతి మిరియాల మొక్కలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కించుమండలో ఉపాధి కూలీల సమీపంలో తత్కాలిక టెంట్‌లు

డుంబ్రిగుడ, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హమీ పనులు చేపడుతున్న ప్రదేశాల్లో తాత్కాలిక టెంట్లను ఏర్పాటు చేశారు. ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి'లో 'ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు దూరం' శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాగం స్పందించింది. ఈసందర్భంగా కించుమండలో ఉపాధి పని ప్రదేశంలో తాత్కాలికంగా కూలీలకు నీడనిచ్చేందుకు టెంటును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏపీవో సంగంనాయుడు మాట్లాడుతూ ఉపాధిపని ప్రదేశాల్లో తాత్కాలికంగా టెంట్లు, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కిట్లను కల్పించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి 'దాడి'

పాడేరురూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మను మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. అనంతరం సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు.

ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సం తలో స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. మారుమూల గ్రామాల నుంచిప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే అనుమానంతో పోలీసులుఅప్రమత్తమైనట్లు తెలుస్తుంది.

విద్యుత్ లైన్‌పై చెట్టు కొమ్మ పడి చెలరేగిన మంటలు

గూడెంకొత్తవీధి, మే 17 , (ఆంధ్రజ్యోతి) : గూడెంకొత్తవీధి నుంచి ధారకొండ సబ్‌స్టేషన్ వెళ్లే మార్గంలో సంపంగి గొంది గ్రామ సమీపంలో విద్యుత్ లైన్‌పై చెట్టు కొమ్మ విరిగిపడింది. దీంతో వైర్లు కలిసిపోయి మంటలు చెలరేగాయి.. అటుగా వెళ్తున్న వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అలాగే, సప్పర్ల, ధారకొండ, దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని 20 గ్రామాలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ట్రాన్స్‌కో సిబ్బందిమరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గూడెంకొత్తవీధిలో త్రుటిలో తప్పిన ప్రమాదం

గూడెంకొత్తవీధి: శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ప్రయాణికులు కిందన లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు ట్రాన్స్‌కో సిబ్బందికి ఫోన్ చేయడంతో వెం టనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

కొయ్యూరు ఎంపీడీవోగా ప్రసాద్



ఎంపీడీవోగా ప్రసాద్

కొయ్యూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కా ర్యాలయంలో ఎంపీడీవోగా జీడీవీ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో పెందుర్తి నుంచి రమేశ్‌నాయుడును గత అక్టోబరు 17న ఇక్కడ నియమించారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు . అనంతరం ఈవోపీఆర్ డీఎస్‌కేవీ ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఎంపీడీవోగా నియమించారు. ప్రస్తుతం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న జీడీవీ ప్రసాద్‌కు పదోన్నతిపై పూర్తిస్థాయి ఎంపీడీవోగా నియమించటంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు కృషి చేయాలి

అనకాపల్లి ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ, మునిసిపల్ అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు కృషి చేయాలని ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం వద్ద బీట్ ద హీట్ అనే టీమ్‌లో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆర్డీవో మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జోనల్ కమిషనర్ బీవీ రమణ మాట్లాడుతూ ప్రజల దాహం తీర్చడానికి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 12 చలివేంద్రాలు, వేసవి వేడి నుంచి ఉపశమనం కోసం 12 గ్రీన్ షెల్టర్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే వడదెబ్బ నుంచి రక్షణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులోకి ఉంచామన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్, సిబ్బంది డి.భాస్కరరావు, ఎం.అప్పారావు, సిహెచ్.గణేశ్ పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో బీట్ ద హీట్ కార్యక్రమం చేపట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

తుమ్మపాల: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనివ్వాలని అనకాపల్లి మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీఎస్.సుబ్బలక్ష్మి సూచించారు. తుమ్మపాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. తడి, పొడి చెత్తలను తమ ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తలు వేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అలాగే మెయిన్ రోడ్డుపై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహరావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ ఈవో ఈశ్వరరావు పాల్గొన్నారు.



తుమ్మపాలలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి సుబ్బలక్ష్మి



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై అవగాహన

లంకెలపాలెం: జీవీఎంసీలోని 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరవాస కాలనీ, పరిసర ప్రాంత గ్రామాల్లో శనివారం స్వర్ణంధ్ర-స్వచ్ఛంధ్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య నివాసితులతో మాట్లాడారు. వేసవి దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్ల ఎక్కువగా తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంధ్ర, నాయకులు ఇల్లపు ప్రసాద్, గొల్లవిల్లి సన్యాసిరావు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కశింకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్, అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ తెలిపారు. కశింకోట, అనకాపల్లి, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారుల పిల్లలకు, సంస్థ ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన ఈ సీట్లను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 23 నుంచి అడ్మిషన్ దరఖాస్తులు పంపిణీ చేస్తామని చెప్పారు. వాటిని పూరించి సమర్పించాలన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగవద్గీతలో శ్లోకాలపై అవగాహన

కశింకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా భగవద్గీతలో శ్లోకాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాలధికారి జగన్ మాట్లాడుతూ శ్లోకాలు, వాటి భావాన్ని చదివి వినిపించారు. భగవద్గీత జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరకాస్తు చేసుకోవాలని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీలోగా వాట్సాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయంలో హాల్‌టికెట్ జెరాక్స్, మార్కుల లిస్ట్, కులధ్రువీకరణపత్రం, ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు. 9398419288, 9849635933, 7386082848, 9177319999 నంబర్లకు వాట్సాప్ ద్వారా తెలపాలని ఆయన కోరారు.

నేడు చిత్రలేఖన పోటీలు

తుమ్మపాల, మే 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ అంశాలపై ఈ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామాలయం నిర్మాణానికి విరాళం

పరవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీ మోటూరువానిపాలెంలో రామాలయం నిర్మాణానికి మల్కాపురానికి చెందిన మోటూరు అప్పలరాజు రూ.50 వేలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.హరి, ఊడి రాములకు శనివారం అందజేశారు.

ఎంఈవో కార్యాలయానికి పాఠ్య పుస్తకాలు

పరవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు మండల విద్యా శాఖ కేంద్రానికి చేరుకున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు మొదటి విడతలో 22,658 పాఠ్య పుస్తకాలు, 33,836 నోటు పుస్తకాలు వచ్చాయని ఎంఈవో ఎం.దివాకరరావు తెలిపారు. వీటిని స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని ఓ గదిలో భద్రపరిచారు. రెండో విడతలో మిగిలిన పుస్తకాలు వస్తాయని చెప్పారు. పాఠశాలలు తెరుచుకొనే నాటికి వీటిని విద్యార్థులకు అందిస్తామని తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

పరవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కార్మికులంతా వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణరావు సూచించారు. ఫార్మాసిటీలోని సియాంకా ఫార్మా పరిశ్రమలో శనివారం నిర్వహించిన హిట్ ద బీట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వడదెబ్బకు గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. పరిశ్రమల వద్ద విరివిగా మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం కార్మికులు, ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సియాంకా పరిశ్రమ డైరెక్టర్ జెట్టి సుబ్బారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

లంకెలపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయం 32వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని పురోహితులతో నూతన వస్త్రాలు, పత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం నిర్వాహకులు పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటాలు, చిడతలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయకులు కోటేశ్వరరావు, శంకరరావు, రౌతు మూర్తి, నాయుడు, రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అనకాపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తొమ్మిది మంది పేదలకు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రూ.9.71 లక్షలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్రి బాబి, నీలబాబు, పచ్చికూర రాము, గొంతిన శ్రీను, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిరివెన్నెల జయంతి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



సిరివెన్నెల జయంతి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చలనచిత్ర గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి 70వ జయంతి వేడుకల పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం ఆవిష్కరించారు. అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. పట్టణంలోని సత్యాగ్రాండ్‌లో ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు వేడుకలు జరగనున్నాయని నిర్వాహకులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్, సభ్యుడు కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: ఎంపీడీవో



కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

పరవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావాడ గ్రామంలో శనివారం నిర్వహించిన బీట్ ద హీట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కల వల్ల ఉష్ణోగ్రతల నుంచి కొంతవరకు ఉపశమనం పొందవచ్చన్నారు. వడదెబ్బ తగలకుండా ఎక్కువగా నీరు తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలన్నారు. సచివాలయం వద్ద చెత్తను అధికారులతో కలిసి తొలగించారు. అనంతరం బాపడ చెరువు వద్ద పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, వెలుగు ఏపీవో రంగారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శాంతి

అనకాపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామంలో ఉపాధి కూలీలకు సర్పంచ్ సాలాపు శాంతి శనివారం మజ్జిగను పంపిణీ చేశారు. గ్రామ శివారులోని ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా చెరువు గట్టు పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు సర్పంచ్ తన సొంత నిధులతో మజ్జిగను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండల దృష్ట్యా శ్రామికుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టినట్టు చెప్పారు. వేసవి కాలమంతా ఈ కార్యక్రమం చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలాపు సూరిఅప్పారావు, కార్యదర్శి నిర్మలా సాయి, ఎన్ఆర్ఈజీఎస్ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బొట్టవానిపాలెం జంక్షన్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి





ప్రమాదాలు జరుగుతున్న బొట్టవానిపాలెం జంక్షన్ ఇదే.. స్పీడ్ బ్రేకర్లు లేని ధర్మారాయుడుపేట కూడలి

పరవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): గాజువాక-ఎలమంచిలి ప్రధాన రహదారిలోని బొట్టవానిపాలెం జంక్షన్ ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఇటీవల తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో మూడు ప్రమాదాలు జరిగాయి. ఒక ప్రమాదంలో యువకుడు మరణించగా, మరో ప్రమాదంలో బాలిక మృతి చెందారు. మరో ఇద్దరు ఫార్మా ఉద్యోగులతో పాటు దంపతులకు గాయాలయ్యాయి.

ఈ కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే రహదారికి ఆనుకొని నివాసాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏదైనా పని మీద వెళ్లేటప్పుడు రహదారి దాటాలంటే గ్రామస్థులు హడలిపోతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వార్డు విద్యా కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు సమస్యలు వివరిస్తున్న వార్డు విద్యా కార్యదర్శులు

కొత్తూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27 సచివాలయాల్లో పని చేస్తున్న వార్డు విద్యాకార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వారంతా మాట్లాడారు. వార్డు విద్యా కార్యదర్శులకు హెచ్‌వోడీ లేకపోవడంతో అన్ని శాఖలవారు వారికి నచ్చిన విధంగా పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా కార్యదర్శుల ప్రమోషన్ నాన్ టెక్నికల్ పోస్టు అయిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా రూపొందించారన్నారు. వారి నియామకం టెక్నికల్ పోస్టు అయినందున ఇతర ప్రభుత్వ విభాగాల్లా తమ సేవలను వినియోగించుకోవాలని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతామని చెప్పారు. ఈ సమావేశంలో అనకాపల్లి పట్టణ విద్యా కార్యదర్శులు వి.భాస్కర్, పి.వరప్రసాద్, ఎన్.తారక్ ప్రభు, కె.నాగరాజు, సిహెచ్ నరేశ్, గీత, నాయుడు, కోటేశ్వరరావు, భార్గవ్ ప్రకాశ్, శ్రీనివాస్, పద్మారావు, శరత్ చంద్ర, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరభద్రరావు అధ్యక్షతన రాష్ట్ర ప్రధానకార్యదర్శి భూషణరావు, రాష్ట్ర సంఘం న్యాయ సలహాదారులు పి.రామచంద్రరావు సమక్షంలో అట్టహాసంగా ఎన్నికలు జరిగాయి. అనకాపల్లి జిల్లా బీసీ ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొణతాల గణేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీవీ.ప్రసాద్, కోశాధికారిగా కె.జోగినాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.దేముడుబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పి.జగదీశ్, ఆర్.అప్పలరాజు, గౌరవ సలహాదారుగా రిటైర్డు తహసీల్దార్ పి.వీరభద్రరావు ఎన్నికయ్యారు. వీరిని వివిధ శాఖల ఉద్యోగులు సత్కరించారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న జగన్

అనకాపల్లి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): బుద్ధుని జీవితచరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్ శనివారం బహుమతులు అందజేశారు. సిద్దార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, వుడా నాగేశ్వరరావు, పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తక్కువ

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

చీడికాడ, మే 17 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయంతో ఎరువులు, పురుగుమందులను తగ్గించి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు అన్నారు. చీడికాడ, పెదగోగాడ, చెట్టుపల్లి గ్రామాల్లో వేసిన 30 రకాల చిరుధాన్యాల పంటలను శనివారం ఏవో కృష్ణవేణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతకాలంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాల న్నారు. తొలకరిలో జిల్లాలో 6,780 ఎకరాల్లో రైతులతో చిరుధాన్యాల పంటలు సాగుకు విత్తనాలు పంపిణీ చేశా మన్నారు. ఆయనతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.అరుణ్, వైసంగీతరెడ్డి, డి.వాసు, బి.నాగమణి పాల్గొన్నారు.

టీడీపీ ఎలమంచిలి అధ్యక్షుడిగా నానాజీ

- రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నిక
- హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

ఎలమంచిలి, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎలమంచిలి పట్టణ శాఖ అధ్యక్షుడిగా గొర్లె నానాజీ, కార్యదర్శిగా ఆడారి ఆదిమూర్తి ఎన్నికయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల్లో మునిసిపాలిటీలోని 25 వార్డుల అధ్యక్ష, కార్యదర్శుల రహస్య ఓటింగ్ ద్వారా టీడీపీ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షునిగా గొర్లె నానాజీ, కార్యదర్శిగా ఆడారి ఆదిమూర్తిలు ఎన్నికైనట్టు నాయకులు ప్రకటించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, పరిశీలకులు బొండా జగన్నాథం సమక్షంలో ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అంతా ఒక్కటేనని, సమిష్టిగా ఉంటూ పార్టీ నిర్ణయాలను అమలు చేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నుకున్నందుకు అధినేతలకు, వార్డు ప్రతినిధులకు గొర్లె నానాజీ కృతజ్ఞతలు తెలిపారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారు సాంబ, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బొద్దపు నాగేశ్వరరావు, బొద్దపు రమణ, కరణం రవికుమార్, నమ్మి రమణ, ముప్పిన కృపారావు, గొర్లె బాబూరావు నూతన అధ్యక్షుడు గొర్లె నానాజీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, ఆడారి మంజు పాల్గొన్నారు.



ఎలమంచిలి పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు తాతయ్యబాబు, ప్రగడ, లాలం భవానీ

పెండింగ్ కేసులపై ఎస్పీ సమీక్ష

» రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ అధికారులకు పలు సూచనలు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఎలమంచిలి, మే 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల దర్యాప్తును వేగంగా పూర్తి చేసి చార్జిషీట్లు వేయాలని పోలీస్ అధికా రులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. శని వారం ఆయన ఎలమంచిలి సర్కిల్ కార్యాలయంతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, స్థానిక సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించారు. తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయాలని, రోడ్డు ప్రమాదాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ శ్రీకృష్ణ చైతన్య, ఎస్ఐలు ఉపేంద్ర, సావిత్రి, రామకృష్ణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నతల్లికి గర్భశోకం

... 5వ పేజీ తరువాయి

గిడిజాల సమీపంలోని నీలకుండీలు వద్ద నివాసం వుంటూ, అక్కడే వున్న ఫ్లైయాష్ ఇటుకల తయారీ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. సొంతూరులో అమ్మవారి పండుగ వుండడంతో ఇటీవల వెళ్లారు. శనివారం ఉదయ తొలుత అప్పలకొండ, అతని భార్య మంగ ద్విచక్ర వాహనంపైన, గంట తరువాత అప్పనాయుడు, భార్య పద్మ, కుమారుడు మనోజ్ (9) మరో బైక్‌పై బయలుదేరారు. సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం సమీపంలో బొర్రమ్మ గెడ్డ వద్ద ఆగిఉన్న బొలేరో వ్యాన్‌ను అప్పలనాయుడు గమనించక బైక్‌తో బలంగా ఢీకొన్నాడు. బైక్‌పై ముందు కూర్చున్న మనోజ్‌కు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పలనాయుడు తీవ్రంగా, పద్మ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పి.సింహాచలం సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రులను 108 వాహనంలో పెందుర్తిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పలనాయుడు పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అప్పలకొండ, మంగ వచ్చి విగతజీవిగా మారిన మనోజ్‌ను చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. మనోజ్ తమ్ముడు శర్వాన్ సత్యనారాయణ గత ఏడాది అనారోగ్యంతో మృతిచెందాడని, మిగిలిన ఒక్కగానొక్క కుమారుడు ఇప్పుడు రోడ్డు దూరమయ్యాడని వారు వాపోయారు. అప్పలకొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్

... 5వ పేజీ తరువాయి

చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ సెంటర్‌లోని మూడు కేంద్రాలు, షీలానగర్‌లో ఒక సెంటర్, రుషికొండలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాల, ఆనందపురం మండలంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇంజనీరింగ్ కళాశాల, బక్కన్నపాలెంలోని బాబా ఇంజనీరింగ్ కళాశాల, దువ్వాడలోని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, పెదగంట్యాడ కేఎల్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్‌లో నిర్వహిస్తారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరూ ఉదయం ఏడు గంటలకల్లా ఆయా కేంద్రాల వద్ద రిపోర్టు చేయాలి. అడ్మిట్ కార్డు మేరకు తనిఖీ, బయోమెట్రిక్ వేయడం పూర్తయ్యాక ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష కేంద్రంలో కంప్యూటర్‌ను కేటాయిస్తారు. అభ్యర్థులెవరూ పెన్ను, పెన్సిల్, తెల్ల కాగితం వంటివి తీసుకురాకూడదు. చిన్న శానిటైజర్ బాటిల్, నీరు బయటకు కనిపించేలా ఉండే వాటర్ బాటిల్‌ను మాత్రమే అనుమతిస్తారు. మహిళా అభ్యర్థులు ముక్కుపుడక, చెవిదుద్దులు, చైన్లు, చేతి గొలుసు వంటివేవీ లేకుండా పరీక్ష కేంద్రాలకు రావాలి.

ఎట్టకేలకు బాలికల వసతి గృహం సిద్ధం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తి

» వైసీపీ హయాంలో ఐదేళ్లు పడకేసిన పనులు

» కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల

» ప్రారంభానికి సిద్ధం చేసిన అధికారులు



ప్రారంభానికి సిద్ధమైన బీసీ బాలికల వసతి గృహం

సబ్బవరం, మే 17 (ఆంధ్రజ్యోతి):

ఎట్టకేలకు మండలంలో బీసీ బాలికల వసతి గృహ నిర్మాణం పూర్తయింది. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇది అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల చేయడంతో పనులు పూర్తయ్యాయి. దీంతో ఇది ప్రారంభానికి సిద్ధమైంది.

సబ్బవరానికి ఐదు కిలోమీటర్ల అవతల ఉన్న వివిధ ప్రాంతాలకు చెందిన హైస్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకునే బాలికలకు వసతి గృహం నిర్మించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ఈ నేపథ్యంలో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీసీ బాలికల వసతి గృహాన్ని సబ్బవరంలోని జడ్పీ హైస్కూల్ పక్కన నిర్మించేందుకు రూ.2 కోట్లు విడుదల చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి 2019 నాటికి 90 శాతం పనులు పూర్తి చేశారు. ఈలోగా ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. మిగతా 10 శాతం పనులను పూర్తి చేయాలంటే మరో రూ.50 లక్షలు అవసరమని విద్యాశాఖాధికారులు అప్పటి వైసీపీ ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు.

దీంతో పనులు ముందుకు సాగలేదు. ఐదేళ్ల పాటు భవన నిర్మాణ పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు విడుదల చేయడంతో నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరానికి అర్హులైన బాలికలకు సీట్లు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. ఈ వసతి గృహం అందుబాటులోకి వస్తే పెందుర్తి, గోపాలపట్నం, కోటపాడు, చోడవరం తదితర మండలాల విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

కృష్ణాదేవిపేట కేంద్రంగా కలప అక్రమ రవాణా?

» యథేచ్ఛగా తరలిపోతున్న టేకు, ఇతర జాతుల కలప

» కిందిస్థాయి సిబ్బంది సహకరిస్తున్నట్టు ఆరోపణలు



కృష్ణాదేవిపేటలో అక్రమ కలప కోసం తనిఖీలు చేస్తున్న అటవీ శాఖ స్క్వాడ్ అధికారులు (ఫైల్ ఫొటో)



అటవీ శాఖ స్క్వాడ్ అధికారులు పట్టుకున్న కలప (ఫైల్ ఫొటో)

కృష్ణాదేవిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. అటవీ శాఖలో ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి, అక్రమార్కులకు సహకరిస్తున్నారు. ఎర్రవరం, కించిలి, గొలుగొండలో అటవీ చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ విలువైన కలప, ఫర్నీచర్ గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతున్నది. ఐదు రోజుల క్రితం కృష్ణాదేవిపేటలో కలపను అక్రమంగా నిల్వచేశారని అందిన ఫిర్యాదు మేరకు ఉత్తరాంధ్ర స్క్వాడ్ ఇన్‌చార్జ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, ఇతర అధికారుల బృందం వచ్చి తనిఖీలు చేపట్టింది. టేకు, ఇతర కలపను పట్టుకుని సీజ్ చేశారు. ఎవరో అజ్ఞాత వ్యక్తులు సమాచారం ఇస్తే తప్ప.. స్థానిక అటవీ సిబ్బంది అక్రమంగా రవాణా అవుతున్న కలపను అడ్డుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» కలెక్టర్ విజయకృష్ణన్



వెబెక్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ నుంచి ఆమె వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలన్నారు.

విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు మాట్లాడుతూ పరీక్షలకు 2,481 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,268 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. వారికి జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ, ట్రెజరీ, పోస్టల్, విద్యుత్, ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనారిటీల రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

» రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహమ్మద్ అహ్మద్



రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహమ్మద్ అహ్మద్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

చోడవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీలకు సంపూర్ణ రక్షణతోపాటు, వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మహమ్మద్ అహ్మద్ తెలిపారు. ఆయన శనివారం చోడవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మసీదులో ముస్లింలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఆయన వెంట ఎమ్మెల్యే రాజు, ముస్లిం సంఘాల నాయకులు వున్నారు.

సచివాలయాల్లో సర్వర్ డౌన్

... 5వ పేజీ తరువాయి

పనిచేసినప్పుడుఅప్‌లోడ్ చేసి, దరఖాస్తుదారులను మరోసారి పిలిపించుకుని ఈ-కేవైసీ చేస్తున్నారు.

మేన్యువల్‌గా దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి

కొన్ని సచివాలయాల్లో సాంకేతిక సమస్యల కారణంగా రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసే విషయంలో ఇబ్బందులున్న మాట వాస్తవమే.

ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటువంటిచోట్ల మాన్యువల్‌గా దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యాక అర్జీదారులను కార్యాలయాలకు పిలిచి ఈ-కేవైసీ పూర్తిచేయాలని సిబ్బందికి సూచించాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. రేషన్ కార్డుల్లో తప్పుల సవరణ నిరంతరం సాగుతుంది. దీనికి గడువు అంటూ లేదు.

అదృశ్యమైన బాలిక కిడ్నాప్

... 5వ పేజీ తరువాయి

మాదిరిగానే ఈ నెల 14వ తేదీన కూడా భార్యాభర్తలు కూలి పనులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి నాలుగేళ్ల చిన్న కుమార్తె లోహిత కనిపించలేదు. ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో 15వ తేదీ సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చేసిన పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఫొటోను వివిధ సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. బాలిక ఇంటి పరిసరాలతోపాటు పలు కూడళ్లల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. 14వ తేదీన పెరుగుబజార్ వద్ద బాలికతో కలిసి ఒక మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. ఈమె ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయగా... విశాఖలోని పెదగంట్యాడకు చెందిన టొంటోని లక్ష్మిగా నిర్ధారించారు. ఆమె కోసం గాలింపును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అనకాపల్లిలో నివాసం ఉంటున్న బోనాల దేవి అనే మహిళను కలవడానికి శనివారం ఉదయం లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామి అనకాపల్లి వస్తున్నారు. జలగలమదుం జంక్షన్ వద్ద పోలీసులు మాటువేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వారి వెంట వున్న బాలిక లోహితను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. బాలికను విక్రయించడానికి లేదా ఇంట్లో పనులు చేయించేందుకు అపహరించి వుంటారని ఎస్పీ తెలిపారు. బాలిక కిడ్నాప్ వ్యవహారంలో ఇంకా ఎవరైనా పాత్ర అయినా ఉందేమోనన్న కోణంలో విచారణ చేపడుతున్నామన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఏఎస్పీ దేవప్రసాద్, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహనరావు, ఎస్ఐలు దాసరి ఈశ్వరరావు, వెలమల సత్యనారాయణలను ఎస్పీ ప్రశంసించి నగదు రివార్డులను అందజేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

నర్సీపట్నంలో దోపిడీ

... 5వ పేజీ తరువాయి

దోచుకుపోయారు. ఇందుకు సంబంధించి బాధితురాలు, పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

శారదానగర్‌లోని ఎల్ఐసీ ఆఫీసు పక్క రోడ్డులో రాళ్లపల్లి వెంకటలక్ష్మి (75) ఒంటరిగా నివాసం ఉంటున్నది. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వెంకటలక్ష్మి గతంలో ప్రభుత్వం ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. కాగా శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో వర్షం కురుస్తున్నది. దీంతో రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. వెంకటలక్ష్మి ఇంటి ప్రధాన ద్వారం తలుపు వేసుకొని టీవీ చూస్తున్నది. ఇద్దరు అపరిచితులు ఇంటి వెనుక వున్న ప్రహరీ గోడ దూకి, తలుపు తీసుకుని లోపలికి ప్రవేశించారు. వెంకటలక్ష్మిపై ఒక్క ఉదుటన దాడి చేసి, ఆమె మెడలో వున్న బంగారం గొలుసు పట్టుకొని గట్టిగా గుంజారు. దీంతో ఆమె కింద పడిపోయింది. కేకలు వేయకుండా నోరు గట్టిగా నొక్కేసి మెడలోని బంగారం గొలుసు, రెండు చేతులకు ఉన్న ఎనిమిది గాజులు, ఉంగరం లాక్కున్నారు. ఈ క్రమంలో వృద్ధురాలి శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. అనంతరం బీరువాలోని వస్తువులు చెల్లాచెదురు చేసి రెండు వెండి కుందులు పట్టుకుని పరారయ్యారు. కాగా హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సాయినాథ్ రోజూ రాత్రి ఎనిమిది గంటలు దాటిన తర్వాత తల్లికి ఫోన్ చేసి మాట్లాడుతుంటారు. శుక్రవారం రాత్రి కూడా తల్లికి ఫోన్ చేయగా.. ఆమె ఎత్తలేదు. పావుగంట తర్వాత మళ్లీ చేశారు. దీంతో జరిగిన దోపిడీ ఘటన గురించి కుమారుడికి చెప్పింది. సాయినాథ్.. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన ఆర్‌వీఆర్‌కే చౌదరితో పరిచయం ఉండడంతో ఆయనకు (ప్రస్తుతం విజయనగరం స్పెషల్ బ్రాంచ్ సీఐగా పని చేస్తున్నారు) ఫోన్ చేసి చెప్పారు. ఆయన పట్టణ సీఐ గోవిందరావుకు ఫోన్ చేసి శారదా నగర్‌లో దోపిడీ జరిగిన విషయం చెప్పారు. కొద్దిసేపటికే డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావు వృద్ధురాలి ఇంటికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ వచ్చి పలుచోట్ల వేలిముద్రలు సేకరించారు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. పోలీస్ జాగిలాలు మెయిన్ రోడ్డు వైపు వెళ్లినట్టు పోలీసులు తెలిపారు. ఆ వీధిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. 10.5 తులాల బంగారం, రెండు వెండి కుందులను దుండగులు దోచుకెళ్లినట్టు ఆమె శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం... crime news

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ఎస్. రాయవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం గ్రామంలో ఓ వివాహిత శనివారం మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రేవుపోలవరం గ్రామానికి చెందిన ధోని మాధవి (25)కి ఏడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన నాగార్జునతో వివాహమైంది. వీరిద్దరూ అన్యోన్యంగా జీవిస్తున్నారు. అయితే మాధవికి ఏ చిన్న కోపం వచ్చినా అలిగి ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకోవడం, మళ్లీ కొంతసేపటి తరువాత తీయడం అలవాటు. ఇటీవల గ్రామంలో జరిగిన అమ్మవారి జాతరకు పుట్టింటి వారు ఆ దంపతులిద్దరినీ పిలిచారు. నాగార్జున తన భార్య మాధవిని అత్తవారింటి దగ్గర దింపేసి తన ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం నాగార్జున అత్తవారింటికి వెళ్లి భార్యను ఇంటిని వెళదాం రమ్మని కోరాడు. అయితే పండుగ రోజు ఎందుకు రాలేదని ఆమె అలిగి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఎప్పటిలాగానే అలిగి తలుపులు వేసుకొని ఉంటుందిలే అనుకొని నాగార్జున అక్కడ ఇంటి బయట బంధువులతో మాట్లాడుతున్నాడు. కొంతసేపటి తరువాత ఉపాధి పనులకు వెళ్లి తిరిగొచ్చిన అతని అత్త ఎంత సేపు పిలిచినా మాధవి తలుపులు తీయలేదు. దీంతో కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుగొట్టి వెళ్లి చూడగా మాధవి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. ఆమెను వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

దేవరాపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి-కొత్తవలస రోడ్డులో ముషిడిపల్లి శివారు రావాడపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. రావాడపాలెం గ్రామానికి చెందిన రావాడ మంగ శనివారం ఉదయం పశువులను కల్లం వద్దకు తోలుకెళుతున్నది. ఈ క్రమంలో అటుగా వెళుతున్న ఆటో బలంగా గేదెను ఢీకొన్నది. దీంతో గేదె వచ్చి ఆమెపై పడిపోయింది. ఈ ప్రమాదంలో మంగ ఎడమ కాలు విరిగిపోగా, కుడి కాలుకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం డిక్కీలోని రూ.2 లక్షలు అపహరణ

అనకాపల్లి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులోని సంతోషీమాత ఆలయ ముఖద్వారం సమీపంలో ద్విచక్ర వాహనం డిక్కీలో ఉంచి రూ.2 లక్షల నగదు శుక్రవారం సాయంత్రం అపహరణకు గురైనట్టు బాధితుడు విల్లూరి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గవరపాలెం విల్లూరి జోగినాయుడు వీధికి చెందిన రిటైర్డు షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగి విల్లూరి సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉడ్‌పేట యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2 లక్షల నగదు విత్‌డ్రా చేసి ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టారు. మెయిన్‌రోడ్డు మీదుగా రింగురోడ్డు వద్ద గల స్వీట్ షాప్‌లో తినుబండారాలు కొనేందుకు వెళ్లి తిరిగి వచ్చి డిక్కీ ఓపెన్ చేయగా నగదు కనిపించలేదు. నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు విచారణ చేస్తున్నారు.

ప్రాణం తీసిన గ్రానైట్ రాయి

» సింగుపురం హైవేపై రెప్పపాటులో రెండు ప్రమాదాలు

» లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు.. 15 మందికి గాయాలు

» అదే ప్రాంతంలో గ్రానైట్ లారీ సడెన్‌బ్రేక్

» లారీ ముందుభాగంపై బండ పడి డ్రైవర్ మృతి

» మృతుడు సబ్బవరం మండల వాసి



డ్రైవర్‌తో సహా నుజ్జునుజ్జయిన గ్రానైట్ లారీ ముందు భాగం

శ్రీకాకుళం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం సింగుపురంలోని కేజీబీవీ సమీపంలో హైవేపై శనివారం వేకువజామున రెప్పపాటులో రెండు ప్రమాదాలు చోటుచేసు కున్నాయి. ఈ ప్రమాదాల్లో గ్రానైట్ రాయి పడి విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన ఒకరు మృతి చెందగా, లారీని ఢీకొని ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న మరో 15మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జైపూర్ నుంచి శ్రీకాకుళం మీదుగా బర్హంపూరానికి ట్రావెల్ బస్సు వెళ్తోంది. ఈ క్రమంలో సింగుపురం హైవే వద్ద.. ముందున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు బస్సుడ్రైవర్ యత్నించాడు. అదే సమయంలో ముందున్న లారీడ్రైవర్... తన వాహనాన్ని కాస్త స్లో చేశాడు. వెనుక ఉన్న బస్సు.. ఆ లారీని ఢీకొంది. ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదు. కానీ బస్సు ముందుభాగం.. లారీ వెనుక భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇదంతా వేకువజామున నాలుగు గంటల సమయంలో జరిగింది. సమాచారం అందడంతో హైవే సిబ్బంది, పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలతో ఉన్న మరికొంతమంది.. మరో వాహనంలో బర్హంపూర్ వెళ్లిపోయారు.

అయితే క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలింపు.. ఇటు హైవేపై వాహనాల మళ్లింపు జరుగుతుండగానే మరో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. అదే రోడ్డుపై నాలుగు లారీలు వస్తున్నాయి. అందులో రెండు లారీలు గ్రానైట్ బండలను టెక్కలికి తరలిస్తుండగా.. మరో రెండు లారీలు ఇతర సరకులతో హైవేపై నుంచి వెళ్తున్నాయి. ముందుగా బస్సు ప్రమాదం జరిగిన చోటుకు రాగానే... గ్రానైట్ బండలతో వెళ్తున్న లారీడ్రైవర్ బ్రేక్ వేశాడు. భారీ సైజు బండలు కావడంతో.. లారీలో ఉన్న ఓ బండ ఏకంగా ముందుభాగంపై పడింది. దీంతో లారీ ముందుభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ రాపర్తి నూకరాజు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ ముందు భాగం నుజ్జుకావడంతో.. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు వచ్చి ప్రత్యేక యంత్రాలతో భాగాలను తొలగించి మృత దేహాన్ని బయటకు తీశారు. అయితే లారీ ఢీకొన్ని ఘటనలో.. అదే రోడ్డుపై దానికి ముందున్న లారీలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయి. పరిమితికి మించిన గ్రానైట్ బండలను లారీలపై తరలించడం.. సడెన్ బ్రేక్ వల్ల బండ ముందుకు కదిలిపోవడం ప్రమాదానికి కారణమైంది. బండలను తరలిస్తున్నప్పుడు వాటిని కట్టకుండా లారీలతో తరలించేయడం దారుణం. నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి తరహా ప్రమాదాల సంభవిస్తునే ఉన్నాయి. సంఘటన స్థలాన్ని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడపునాయుడు, ఎస్ఐలు హరికృష్ణ, రాము పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన వ్యక్తిగా మృతుడ్ని గుర్తించి అక్కడకు పోలీసులు సమాచారం చేరవేశారు.

ఒక్కో టీచర్ పోస్టుకు 26 మంది పోటీ

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తుచేయగా వీరిలో అత్యధికంగా బీసీ-డీ నుంచి 8,330, తరువాత బీసీ-బీ నుంచి 2,563 మంది, బీసీ-ఏ నుంచి 1,940, బీసీ-ఈ నుంచి 423, బీసీ-సీ నుంచి 198 మంది ఉన్నారు. ఓపెన్ కేటగిరీ నుంచి 1,626 మంది దరఖాస్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు తరువాత విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్సీ కేటగిరీ-1 నుంచి 479 మంది, కేటగిరీ-2 నుంచి 876 మంది, కేటగిరీ-3 నుంచి 2,821 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. దివ్యాంగుల కోటాలో అన్ని కేటగిరీలు కలిపి 890 దరఖాస్తులు వచ్చాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544